

# గోరంత పొరపాటు

## డి.కనక దుర్గ

పది నిముషాల్లో స్నేహితులై పోయారిద్దరూ కబుర్లమీద కబుర్లు పైగా టూ టైర్ కంపార్ట్ మెంట్‌లో ఎక్కువ రష్ లేకపోవడంతో వేరే సీట్లలో ఎవరూ లేరు

'గోదావరి ఇంత ఖాళీగా వుండటం కేవలం నా అదృష్టం అనుకున్నాడు సత్యనారాయణ అందమైన రాత్రి చల్లటి గాలి, ఎదురుగా ఎదురు చూడని అవకాశం కలిసి వచ్చి అదే పెట్టెలో ఎక్కిన మాధురి మధురంగా ఆమె చెప్పే కబుర్లు

అసలు ఆ రోజు ప్రయాణం విసుగ్గా మొదలయింది విశాఖపట్నంలోనే గంట లేటుగా బయలు దేరింది గోదావరి ఎవరో మినిష్టరు మీటింగు పూర్తి చేసుకుని రావాలని రైలు ఆపారు ఎప్పుడూ లేనిది అరగంట ముందుగా స్టేషన్‌కివచ్చిన సత్యనారాయణకి అంతసేపు వెయిట్ చెయ్యడం విసుగేసింది ఎక్కి కూచుని తన దగ్గరవున్న పుస్తకాలు తిరిగేశాడు ఎప్పుడూ పుస్తకాలు చదవకపోయినా ప్రయాణంలో కొన్ని రకాల పుస్తకాలు దగ్గర పెట్టుకుంటాడు అడిగిన ఫ్రెండ్స్‌కి అసలు రహస్యం చెప్పేస్తాడు

ఊరికే ఆడపిల్లలతో మాట్లాడాలని ట్రైచేస్తే చెప్పు దెబ్బలు తథ్యం మనం అసలు వాళ్లని పలకరించకూడదు పైగా పాతికేళ్ళలోపు ఆడపిల్లలతో తండ్రో, అన్నో, కనీసం అక్కయ్యో వుంటారు కనక ప్రమాదం వాళ్ళు మనతో మాట్లాడాలంటే ఒకటే ఆయుధం రకరకాల పుస్తకాలు కనపడేటట్టు వుంచుకోవాలి అప్పుడు వాళ్ళే మనకి ఫేవర్ అడుగుతారు ముఖ్యంగా వుంచవలసినవి లేటెస్ట్ స్టార్ జస్ట్, ఫిల్మ్‌ఫేర్, రెండు మూడు తెలుగు వార పత్రికలు, ఒక్క ఇంగ్లీషు నవల– ఇది ఎవ్వరూ తీసుకోరనుకో – పామిస్ట్రీమీద లావాటి పుస్తకం ఒకటి కొంచెం ధైర్యం వున్న పిల్లయితే పామిస్ట్రీ వచ్చా అని అడిగి చెయ్యికూడా చూడమంటుంది బాగుందా ప్లాను ట్రైచెయ్యి బ్రదర్' అని సలహాలు గూడా ఇస్తాడు చిరుదరహాసంతో

ఈ సారి ప్రయాణంలో విశాఖపట్నంనించి సామర్లకోట దాకా ఎవరూ ఎక్కలేదు సామర్లకోటలో ఆగగానే ఒక్కసారి మెరుపు మెరిసింది, అనుకున్నాడు సత్యనారాయణ లోపలకి ఎక్కిన మాధురిని చూసి, కానీ తన రూలు ప్రకారం ఎదురు సీట్లో కూర్చున్న మాధురిని తనకై తను పలకరించలేదతను పుస్తకం మొహానికి అడ్డం పెట్టుకుని వీలైనప్పుడల్లా ఆమెని చూశాడు పామిస్ట్రీ పుస్తకం చదువుతున్నా కూడా ఆమె వూరుకుంది, కానీ ఏమీ అడగలేదు గట్టిపిల్లే" అనుకున్నాడతను

రాజమండ్రిలో సూట్‌కేస్ తీస్తుంటే పైన పేరు చూశాడు ఆకెళ్ల సూర్యనారాయణమూర్తి, సామర్లకోట అని వుంది ఎక్కడో విన్నట్టుందీపేరు అని పది నిముషాలు ఆలోచించాడు గుర్తొచ్చింది వెంటనే ఎగిరి గంతెయ్యాలనిపించింది వెంటనే ఆ అమ్మాయిని పలకరించాడు

'ఎక్స్యూజ్‌మి ఆయన మీకేమవుతారు ఒంగి సూట్‌కేస్‌లోంచి ఎయిర్‌పిల్లో తీస్తున్నదల్లా చటుక్కున వెనక్కి తిరిగింది ఒక్కక్షణం తటపటాయించి మా నాన్నగారు అంది

అలాగా' మీ భానక్కయ్యకి మరిది నవుతాను నేను దాచుకోలేనట్టు వెంటనే అన్నాడు ప్రశ్నార్థకంగా చూసింది ఆమె

భానుమతిగారి భర్త నాకు పెద్దమ్మ కొడుకు అన్నయ్య అవుతారు" వివరించాడు

చిరునవ్వు ఎంత అద్భుతంగా వుండవచ్చో తెలిసింది సత్యనారాయణకి అప్పుడు మాధురిని చూశాక

చుట్టరికం తెలిశాక వుత్సాహం వచ్చిందతనికి భాను వదినకి స్వంత పెదనాన్న కూతురు ఈ సౌందర్యరాసి తర్వాత మాటల్లో ఎక్కువభాగం

అతనిదే అయింది

'హైదరాబాదులో నేను చూసిన ఆరులక్షల అందమయిన ఆడపిల్లల్లో మీఅంత బాగున్న వాళ్ళు ఒక్కళ్ళూ లేరు' అనుకొని ఈ పొగడ్తకి అందంగా సిగ్గుపడింది

మొదట్లో లోకాభిరామాయణం మాట్లాడినా తరువాత సీరియస్‌గా ఆలోచించడం మొదలు పెట్టాడతను చుట్టరికం వుంది కాబట్టి పెద్దవాళ్ళ అభ్యంతరం వుండదు తనకి 28 ఏళ్ళు బ్యాంక్‌లో క్లార్క్ హైదరాబాదులో చిన్న యిల్లుంది ఒక్కడే కొడుకు అక్కయ్యలిద్దరికీ పెళ్ళిళ్ళయిపోయాయి తననీ త్వరగా పెళ్ళి చేసుకోమని అమ్మ బ్రతిమిలాడుతోంది మాధురివాళ్ళది మామూలు సంసారమేట ఎమ్ ఎ చదివినా పెళ్ళి సమస్యే కదా! వుద్యోగానికి వేరేవూరు పంపరట వాళ్ళ నాన్నగారు అంటే వెంటనే పెళ్ళి చెయ్యాలనే కదా! పైకి ఏవో మాట్లాడుతున్నా యివన్నీ ఆలోచిస్తూనే వున్నాడు సత్యనారాయణ విజయవాడ వచ్చేటప్పటికి ఇద్దరూ చాలా మాట్లాడుకున్నారు చదివిన స్కూళ్ళు, కాలేజీలు దగ్గర స్నేహితులు, కుటుంబాల్లోని మనుష్యులు, సంఘంలోని ఆచారాలమీద అభిప్రాయాలు, రక రకాల జబ్బులు – అనేకం మాట్లాడుకునే సరికి ఒకరికి ఒకరు బాగా తెలిసినవాళ్ళలా అనిపించింది యిద్దరికీ రెండయాక "యింక నిద్రొస్తోంది అంది మాధురి

ఈ టైమ్‌దాటితే యిక ఛాన్స్‌రాదు ఆమె హైదరాబాదులో దిగి వాళ్ళ పిన్నిగారింటికి వెళ్ళిపోతుంది ఆమె అభిప్రాయం కనుక్కుంటే భానువదిన ద్వారా తన తల్లి దండ్రులతో చెప్పించవచ్చు

"మాధురీ మీరేం అనుకోనంటే ఒక్క విషయం నా వుద్యోగం, కటుంబ విషయాలు అన్నీ మీకు చెప్పాను మీ విషయాలూ నాకు తెలిశాయి మీకు అభ్యంతరం లేకపోతే భానువదినతో మాట్లాడి మన పెళ్ళి జరిగేట్టు చూడగలను మీకిష్టం లేకపోతే ఈ విషయం యిక్కడితో మర్చిపోండి అఫ్‌కోర్స్ రూపంలో మీకు నేను మ్యాచ్ కాదనుకోండి" చివరి వాక్యం నొక్కి మరీ అన్నాడు

తలవంచుకుని కూర్చుంది అయిదు నిమిషాలు మాధురి తరువాత చిరునవ్వుతో సమాధాన మిచ్చింది

థాంక్యూ వెరీమచ్. నా పెళ్ళి సమస్య తీర్చేరు మా పేరెంట్స్‌కి కానీ నేనేం కట్నం ఇచ్చుకోలేను "

"మీలాంటి భార్యే ఒక కట్నం ఆనందంతో ఇంక మాట్లాడలేకపోయాడు సత్యనారాయణ

మాధురి నిద్రపోయింది కానీ అతనికి నిద్ర పట్టలేదింక మనసెంతో లాగినా యింక చనువు తీసుకుంటే మాధురి అపార్థం చేసుకుంటుం దేమోనని అతి కష్టంమీద అటువేపు తిరిగి పడు కున్నాడు

లేవండి సికింద్రాబాదు వస్తోంది' మాధురి పిలవడంతో లేచాడు అన్నీ సర్దుకొని కూర్చునివుంది ఆమె గబగబా దుప్పటి మడిచి సూట్‌కేస్‌లో పెట్టాడు పుస్తకాలన్నీ బాగ్‌లో పెట్టేశాడు రైలాగింది సికింద్రాబాదు స్టేషన్‌లో

పదండి మాధురీ

మీరు దిగండి మా కజిన్ వచ్చేవరకు నేనిక్కడే వుంటాను

రెండుసార్లు చెప్పినా ఆమె కదలలేదు విదిలేక తను దిగిపోయాడు సత్యనారాయణ దిగి కిటికీ దగ్గర్నించి కూడా పిలిచాడు అయినా సీటులోంచి లేవలేదు మాధురి

మీరు వెళ్ళిపోండి ఎడ్రస్ యిచ్చారుగా నేను వుత్తరం రాస్తాను అంది

ప్లాట్‌ఫారం మీద నడవడం మొదలు పెట్టాడు కొంతదూరం వెళ్ళాక వెనక్కి చూశాడు రైలు దిగి ప్లాట్‌పారం మీద నిలబడివుంది మాధురి అటూ యిటూ ఎవరికోసమో చూస్తోంది గబగబా వెనక్కి వెళ్ళాడు సత్యనారాయణ


నాతో రండి పోనీ, ఎడ్రసు మీదగ్గరుందికదా! తేలిగ్గానే కనుక్కోవచ్చు మిమ్మల్ని దింపేసి వెడతాను

వద్దండీ మా తమ్ముడు వస్తాడివ్వుడు నిద్రలేవడం ఆలస్యం అయివుంటుంది మీరు వెళ్ళండి

పోనీ బయటిదాకా రండి అక్కడే చూద్దాం ఆట్నించే రావాలికదా!

లేదండీ నేను యిక్కడే వుంటాను మళ్ళీ వెతుక్కుంటాడు మీరు వెళ్ళండి ప్లీజ్






కొంచెం చిరాకు వచ్చింది సత్యనారాయణకి ఇందాక తను రైలు దిగమంటే దిగనంది ఇప్పుడు కనీసం ..యట దాకా నన్నా కంపెనీ ఇద్దామంటే రానంటుంది ఏమిటీ అమ్మాయి తత్వం?

"ప్లీజ్ మీరు వెళ్ళిపోండి మీరు వెళ్ళే దాకా నేను కదలను యిక్కడ్నుంచి నవ్వుతూనే అంది మాధురి

ఇంకేం మాట్లాడకుండా బయట గేటు వైపు నడిచాడు సత్యనారాయణ? బయటికి వచ్చాక మాధురిని వదిలి వెళ్ళ బుద్ధికాలేదు అయినా తనుండగా కదలనంటుందేమిటి? చూద్దాం ఏమిటో సంగతి అనుకుంటూ అక్కడే వున్న ఒక టాక్సీ వెనకగా నిలబడ్డాడు అతను

"ఏమైనా సరే మాధురి వెళ్ళాకే వెళ్ళాలి" అనుకుంటూ. పది నిమిషాల తరువాత దూరంగా వస్తూ కనిపించింది మాధురి. పదహారేళ్ళ అబ్బాయి ఆమె పెట్టి పట్టుకున్నాడు అరె అదేమిటి అనుకోకుండా సత్యనారాయణ నోటి వెంట వచ్చేశాయా మాటలు కుడికాలు బాగా ఈడుస్తూ నడుస్తోంది మాధురి చీర బాగా కిందదాకా వుండటం వల్ల కాలికేమైందో కనిపించలేదు సత్యనారాయణకి అయినా నవ్వుతూ పక్క అబ్బాయితో కబుర్లు చెప్తూ నడుస్తోంది ఆ అబ్బాయి కూడా మెల్లిగా నడుస్తూ అప్పుడప్పుడు మాధురి భుజం పట్టుకుని ఆమెకి నడవడానికి సాయం చేస్తూ నడుస్తున్నాడు

అదిరిపోయాడు సత్యనారాయణ ఎంత మోసం!' చూడటానికి అంత బాగుంటే తను ఇంకేం ఆలోచించలేదు చిన్నప్పుడు రెండుసార్లు టైఫాయిడ్ వచ్చిందని, చెప్పింది మాటల సందర్భంలో మాధురి అప్పుడేమైనా కాలు వంకరయి వుంటుంది తను పెళ్ళి గురించి మాట్లాడి నప్పుడు కూడా చెప్పలేదు తనకీ అవకరం వుందని అంత బాగున్న అమ్మాయి తన లాగా సామాన్యంగా వున్న వాడిని వెంటనే ఒప్పుకుందంటే ఆశ్చర్యమే మరి పైగా,

"మా పేరెంట్సుకి నా పెళ్ళి సమస్య తీర్చారు" అంది

అవును మరి కుంటికాలుంటే పెళ్ళవడం కష్టమే

## గోరంత పొరపాటు

కదా అందుకేనేమో తను కంపార్ట్‌మెంట్‌లో వున్నంత సేపు ఎటూ కదలకుండా కూర్చుంది తనతో స్టేషన్ బయటకు రమ్మంటే రానంది తను చూస్తున్నంత సేపు కంపార్ట్ మెంట్ దిగలేదు తను యిక్కడ వుండబట్టేకదా ఆమె రహస్యం బట్టబయలైంది ఘాటుగా వుత్తరం రాయాలి కందిపోయిన మొహంతో ఎదురుగా కనిపించిన ఆటో ఎక్కేశాడు సత్యనారాయణ

ఆ సాయంత్రమే కూర్చుని మాదురి యిచ్చిన లోకల్ ఎడ్రస్‌కి ఘాటుగా వుత్తరం రాశాడు నాలుగు పేజీల సుదీర్ఘమైన వుత్తరంలో తనని మోసం చేసినందుకు వచ్చిన కోపం అంతా వెళ్ళగక్కాడు ఇక జన్మలో ఆడవాళ్ళని నమ్మనని, అందులో అందమైన ఆడవాళ్ళని అసలే నమ్మనని శపథం చేస్తూ వుత్తరం పూర్తి చేశాడు రాత్రి ఎనిమిదింటికి పోస్ట్ డబ్బాలో వుత్తరం వేశాక గానీ సత్యనారాయణ కసి చల్లారలేదు

నాలుగు రోజులయాక భానుమతి దగ్గర్నించి వుత్తరం వచ్చింది సత్యనారాయణకి

చిరంజీవి సత్యాన్ని

ఆశీర్వదించి నీ వదిన వ్రాయునది ఇప్పుడే మాధురి రాసిన వుత్తరం అందింది నువ్వు, తనూ రైల్లో కలిశారట. మీరు వివాహం చేసుకుందామని తీసుకున్న నిర్ణయం నన్నెంతో ఆనందపరచింది. వచ్చే వారం వీలు చేసుకుని హైదరాబాదు వచ్చి మ. స. అత్తయ్యగారితో శ్రీ మామయ్యగారితో మాట్లాడతాను మీ పెళ్ళి జరిపించే బాధ్యత నాది

మాధురి నీకొక విషయం రాయమంది రైలుదిగాక స్టేషను బయటకు నువ్వెన్నిసార్లు చెప్పినా తను రానన్నందుకు నీకు కోపంవస్తే తనని క్షమించమని చెప్పమంది రైలెక్కగానే తన చెప్పులు రెండూ తెగిపోయాయిట నీతో చెప్పడానికి మొహమాట పడిందట అందుకే నీతో రైలు దిగకుండా, నువ్వెంత చెప్పినా ప్లాట్‌ఫారం బయటకు రాకుండా వుండిపోయిందిట మా తమ్ముడి సాయంతో ఎలాగో బయటదాకా నడిచి ఆటో ఎక్కగలిగిందిట నువ్వేమైనా అనుకున్నావేమో అని బాధపడుతూ రాసింది వుత్తరం ఇప్పుడే తనకీ వుత్తరం రాస్తున్నాను నువ్వలా అనుకునేవాడివి కావని

ఇక్కడంతా క్షేమం నే వచ్చేటప్పుడు ముందుగా సామర్లకోట వెళ్ళి మా పెద్దనాన్నతో మాట్లాడి వస్తాను నా రాకకై నువ్వెదురు చూస్తుంటావని తెలుసు మంచి పట్టు చీర కొనిపెట్టు నాకు ప్రెజెంటేషన్ ☐

వుంటాను,

ప్రేమతో,
భాను వదిన

## మలేరియా టీకాలు

పశ్చిమ జర్మనీలో మాక్స్ ప్లాంక్ బయో కెమిస్ట్రీ ఇన్‌స్టిట్యూట్‌లోని శాస్త్రవేత్తలు మలేరియాకు టీకా మందును రూపొందించడానికి కృషి చేస్తున్నారు జంతువులపై జరిగిన ప్రయోగాల్లో ఈ కొత్త మందు చాలా ఉపయోగకరంగా ఉందని తేలింది తృతీయ ప్రపంచ దేశాలలో మలేరియా విపరీతంగా వ్యాపిస్తున్నది ప్రపంచ మంతటా 20 కోట్ల మంది మలేరియాతో బాధపడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల పేర్కొన్నది దోమకాటు వలన స్పోరోజో యిట్స్ అనే మలేరియా పరాన్న భుక్కులు శరీరంలోకి ప్రవేశిస్తాయి దీనివలన రక్తంలో మెరోజాయిట్స్ పెరిగి ఎర్ర కణాలను నాశనం చేస్తాయి మాక్స్‌ప్లాంక్ సంస్థలోని శాస్త్రవేత్తలు వెరోజోయిట్స్‌ను వేరుచేసి వాటిని నిరోధించగల యాంటిజెన్‌ను తయారు చేశారు రోగ నిరోధక శక్తిని రూపొందించే వివిధ రకాల నిరోధక మందుల కలయికతో కొత్తమందును రూపొందించడానికి శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు మరికొంత కాలంలో మలేరియాను నిరోధించగల టీకామందుని తయారు చేయగలమని వీరు భావిస్తున్నారు

(గ్లోబల్)